క్లుప్తంగా

వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయడం జరిగిందని నగర కమిషనర్ చేకూరి కీర్తి తెలిపారు. ఈ నెల 9న సంపత్ నగర్‌లో బాలికపై వీధి కుక్కల దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పాటు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కమిషనర్ స్పందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు కుక్కల దాడిలో గాయపడిన బాలికను ఎంహెచ్‌ఓ మధుసూదన్ పరామర్శించి, తల్లిదండ్రులతో మాట్లాడారు. ఏటుకూరు రోడ్డులో కుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) చేయడానికి ఏజెన్సీని గుర్తించడం జరిగిందని, అగ్రిమెంట్ పూర్తి చేసి, అతి త్వరలో ఏబీసీ ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. జంతు ప్రేమికులు కూడా వీధి కుక్కల విషయంలో నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల తీవ్రతను గమనించి, వీధి కుక్కలకు ఏబీసీ చేయించడంలో నగర పాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ కోరారు.

గ్రేడ్-1 సూపరింటెండెంట్‌గా కిరణ్మయికి ఉద్యోగోన్నతి



గుంటూరు మెడికల్: మంగళగిరి గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చిలువూరి కిరణ్మయికి గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి లభించింది. గురువారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లకు ఉద్యోగోన్నతి కల్పించారు. కిరణ్మయిని కర్నూలు జిల్లా ఆదోని గవర్నమెంట్ ఆసుపత్రికి బదిలీ చేశారు. సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో 2000 సంవత్సరంలో జీఎన్ఎం పూర్తి చేసి, 2001లో సిద్దిపేట స్టాఫ్‌నర్సుగా విధుల్లో చేరి కిరణ్మయి.. ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించారు. 2007లో హెడ్ నర్సుగా ప్రమోషన్ పొందారు. 610జీవోలో భాగంగా 2008లో ప్రభుత్వ జ్వరాల ఆసుపత్రికి బదిలీ అయ్యారు. 2019లో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగన్నతి పొంది, మంగళగిరి బదిలీ అయ్యారు. ఆమెకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని, పలువురు గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు అభినందనలు తెలిపారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య?

గుంటూరు ఈస్ట్ : ఓ ప్రైవేటు బ్యాంకు సిబ్బంది ఇబ్బందులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన ఘటన నగరంలో కలకలం రేపింది. మృతురాలి బంధువుల సమాచారం మేరకు.. పట్నం బజారులో నివాసం ఉండే సాంబ్రాజ్యం కుమార్తె అప్పికట్ల జ్యోతి (33) ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో బంగారం తాకట్టు పెట్టింది. అయితే వడ్డీ ఎక్కువ కట్టాల్సి రావడంతో నగరంలోని ప్రముఖ ప్రైవేటు బ్యాంకుకు వెళ్లింది. తాకట్టు పెట్టిన బంగారం నగలు టేకోవర్ చేయాల్సిందిగా కోరింది. అందుకు బ్యాంకు సిబ్బంది ఒప్పుకుని రూ. 10.50 లక్షల చెక్కును జ్యోతికి ఇచ్చారు. జ్యోతి బంగారు నగలు విడిపించుకు వస్తానని వెళ్లగా.. బ్యాంకు సిబ్బంది ఆ నగదు డ్రా చేసి పరారైంది అంటూ ప్రచారం చేశారు. జ్యోతి ఇంటికి వెళ్లి ఆమె తల్లి సాంబ్రాజ్యాన్ని బెదిరించి, ఆమె చేతిలో మొబైల్ ఫోన్ లాక్కొన్నారు. జ్యోతి సమీప బంధువులకు ఫోన్ చేసి ఆమె డబ్బుతో పరారైందంటూ చెప్పారు. అలాగే జ్యోతికి ఫోన్ చేసి.. ఆమెపై పోలీసు కేసు పెడుతున్నామంటూ బెదిరించారు. దీంతో మనస్తాపం చెందిన జ్యోతి బంధువులకు.. తన చావుకు కారణం బ్యాంకు సిబ్బంది అంటూ వాయిస్ మెసేజ్ పంపింది. బంధవులకు ఫోన్ చేసి, పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థులను ఇష్టమైన రంగంలోనే ప్రోత్సహించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను వారికి ఇష్టమైన రంగంలోనే ప్రోత్సహించాలని విజయవాడ డీఐజీ విశాల్ గున్నీ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని కెనడీస్ నెక్స్ జెన్ కిడ్స్ పాఠశాల 10వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాల్ గున్నీ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు వీలైనంత తక్కువ సమయాన్ని కేటాయించి, పుస్తక పఠనం ద్వారా విజ్ఞానార్జనకు అధిక సమయాన్ని కేటాయించాలని విద్యార్థులకు సూచించారు. సంయుక్త రవాణా కమిషనర్ బి. కృష్ణవేణి మాట్లాడుతూ విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రావీణ్యులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, ప్రిన్సిపల్ పీఎల్ హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరానికి విశేష స్పందన

ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా



మందుల కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష తొలి, రెండో విడత కార్యక్రమాలకు విశేష స్పందన లభించిందని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అన్నారు. 4వ డివిజన్ ఎల్బీ నగర్, 7వ డివిజన్‌లోని లాల్‌జాన్ బాషా షాదీఖానాలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రతి పేదవాడికి వైద్యాన్ని చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్పొరేట్ వైద్యాన్ని పేదల ఇంటి ముంగిటకు చేర్చి ఆరోగ్యానికి భరోసా కల్పించారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొహమూద్, వైఎస్సార్ సీపీ నేత ఖలీల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో నటరత్నాలు చిత్ర దర్శకుడు

ఏఎన్‌యూ: త్వరలో విడుదల కానున్న 'నటరత్నాలు' చిత్ర దర్శకుడు నర్రా శివ నాగేశ్వరరావు గురువారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించారు. విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అందిస్తున్న కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్ వినూత్నమైన ఆలోచనతో ఈ కోర్సులు ప్రారంభించడం అభినందనీయమన్నారు. యల్లమాటి చంటి నిర్మాతగా ఫిబ్రవరిలో విడుదల కాబోతున్న క్రైమ్, కామెడీ చలన చిత్రం 'నట రత్నాలు' విశేషాలను శివనాగేశ్వరరావు పంచుకున్నారు. బిగ్‌బాస్ ఫేమ్ ఇనయా సుల్తానా, సుదర్శన్ రెడ్డి, రంగస్థలం మహేష్, తాగుబోతు రమేష్, అర్చన నటించారని తెలిపారు. స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విశేషాలను విభాగ కో-ఆర్డినేటర్ డాక్టర్ అనిత వివరించారు.

కేజీ బేసిన్ లాభాల్లో 50శాతం వాటా ఏపీ హక్కు



మాట్లాడుతున్న అవధానుల హరి

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్‌కు 12వ ఆర్థిక సంఘం సిఫార్సు ప్రకారం కేజీ బేసిన్ చమురు, గ్యాస్ నిక్షేపాల లాభాల్లో 50 శాతం వాటా ఇవ్వాల్సిందేనని వివిధ ప్రజా సంఘాల నాయకులు, విభాగాల నిపుణులు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం 'కేజీ బేసిన్ చమురు, గ్యాస్ – ఆంధ్రప్రదేశ్ వాటా' అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని, ప్రసంగించారు. సమావేశానికి జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం కార్యదర్శి అవధానుల హరి అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న కేజీ బేసిన్ గ్యాస్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గ్యాస్.. పొలాల గుండా పైపులు వేసి ఎంతో దూరంగా ఉన్న గుజరాత్‌కు తరలించడం, అక్కడ తక్కువ ధరకే ప్రజలకు అందించటం చాలా అన్యాయమన్నారు. 12వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన విధంగా ఏపీకి గ్యాస్ ఇచ్చి ఉంటే వంట గ్యాస్ సిలిండర్ వంద రూపాయలకే వస్తుందన్నారు. అందుకు ఆంధ్రులందరూ ఉద్యమించి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఆమ్ ఆద్మీ పార్టీ పశ్చిమ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ తాతా సేవ కుమార్, ఆంధ్ర ప్రజా సమితి జయరాజు, జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని, కార్యదర్శి అవధానుల హరి, ప్రముఖ ఆడిటర్ పి.వి. మల్లికార్జునరావు, జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి. లక్ష్మణ్ రెడ్డి, అవగాహన సంస్థ కార్యదర్శి శివరామిరెడ్డి పాల్గొన్నారు.

అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అప్పుల బాధతో మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసుల వివరాల మేరకు.. నల్లచెరువు 23వ లైనుకు చెందిన బొడ్డు మరియన్న (45) పెయింటింగ్ పని చేస్తున్నాడు. మద్యానికి బానిసై అప్పుల బాధతో గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య చిన్నమ్మాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మార్కెట్లో సంక్రాంతి ఆఫర్లు

- వస్త్రాలు, ఫర్నీచర్, ఆభరణాలు, వాహన కొనుగోళ్లపై ప్రత్యేక డిస్కౌంట్లు
- ఉచిత బహుమతులతో ఆకర్షిస్తున్న మొబైల్ షాపులు
- కొనుగోలుదారులతో కిటికిటలాడుతున్న దుకాణాలు



వస్త్ర కొనుగోలు దుకాణంలో..



నిమ్మల గార్డెన్స్‌లోని వేదిక

పాత గుంటూరు: గుంటూరులో సంక్రాంతి శోభ సంతరించుకుంది. కుటుంబ సమేతంగా సంక్రాంతి షాపింగ్ చేస్తుండడంతో దుకాణాల్లో సందడి నెలకొంది. వస్త్ర దుకాణాలు కిటికిటలాడుతున్నాయి. సంక్రాంతి పురస్కరించుకొని షోరూం యాజమాన్యాలు కురిపిస్తున్న ఆఫర్లతో గుంటూరులో కార్లు, బైక్ షోరూముల్లో ఎక్స్చేంజ్ మేళాలు, ఆఫర్లు, ప్రత్యేక డిస్కౌంట్లు, విలువైన ప్రత్యేక బహుమతులు, బంపర్ లక్కీడ్రాలు అందిస్తున్నాయి. వస్త్ర కొనుగోళ్లపై 20 నుంచి 50 శాతం వరకు ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తున్నారు. ద్విచక్రవాహన షోరూంలలో పాత వాటిని తీసుకొని కొత్త వాహనాలను అందించడమే కాకుండా ప్రత్యేక రాయితీలు ప్రకటిస్తున్నాయి. ఫర్నీచర్ షాపుల్లో టేబుల్స్, బెడ్స్, సోఫా సెట్లు, గ్రైండర్లు, మైక్రోవేవ్ ఓవెన్లతో పాటు ఇతర సామగ్రి కొనుగోళ్లలో 25 శాతానికి పైగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. గుంటూరులోని బ్రాడీపేట, లక్ష్మీపురం, పట్నం బజారు, గోల్డ్ షోరూంలలో ప్రత్యేక డిస్కౌంట్లు అందిస్తుండడంతో కొనుగోలుదారులతో సందడి నెలకొంది. బంగారం ధర అధికంగా ఉన్నప్పటికీ షోరూం యాజమాన్యాలు అందిస్తున్న డిస్కౌంట్లతో కొనుగోళ్లు పెరిగాయని షోరూం నిర్వాహకులు చెబుతున్నారు.

పెరిగిన మొబైల్ కొనుగోళ్లు

నగరంలోని బ్రాడీపేట తదితర ప్రాంతాల్లో మొబైల్ షాపుల్లో స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేసిన వారికి బహుమతులు అందజేస్తున్నారు. హెడ్సెట్, బ్లూ టూత్, హోం థియేటర్, పవర్ బ్యాంక్ ఇలా ప్రతీ కొనుగోలుపై ప్రత్యేక బహుమతులు అందిస్తున్నారు. పండగ రోజు లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసి, విలువైన వస్తువులను బహుమతిగా అందిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

వేడుకలకు సిద్ధమైన ఫంక్షన్ హాల్స్

గుంటూరులోని స్వగృహ ఫంక్షన్ హాల్, పెద పలకలూరు రోడ్డులోని నిమ్మల గార్డెన్స్ శుభకార్యాలకు ముస్తాబయ్యాయి. ఆధునిక హంగులతో ప్రజలకు అన్ని వసతులతో సౌకర్యవంతంగా ఉండే విధంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.







పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి కృషి

తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నూరి ఫాతిమా



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్లతో నూరిఫాతిమా

పట్నంబజారు: నియోజకవర్గంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా అన్నారు. 6వ డివిజన్ రైలు పేట పరిసర ప్రాంతాల్లో గురువారం ఆమె పర్యటించారు. డివిజన్ పరిధిలో పేరుకు పోయిన వ్యర్థాలను పరిశీలించి, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి స్వయంగా చెత్తను తొలగించారు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మెలో నేపథ్యంలో.. చెత్త తొలగింపునకు ప్రత్యేక దృష్టి సారించినట్లు నూరి ఫాతిమా తెలిపారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నేతలు జాఫర్ ఖాన్, ఆవుల కోటేశ్వరరావు, షరీఫ్, దుర్గాప్రసాద్, జిలానీ, అఫ్రోజ్, రెహమాన్ పాల్గొన్నారు.

జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న ప్రభుత్వ మహిళ కళాశాలలో నిర్వహించనున్న జాబ్ మేళా పోస్టర్లను సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ఆవిష్కరించారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియంలోని ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళా వివరాలకు 63042 92828, 80746 07278 నంబర్లకు సంప్రదించాలని అధికారులు తెలిపారు. గుంటూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.ప్రణయ్, నరేష్, రవికుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి

ఈ నెల 19న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. రూ. 400 కోట్లతో స్వరాజ్య మైదానంలో నిర్మించిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు ఉన్నారు.

9వ రోజుకు విజయసంకల్ప యాత్ర

గుంటూరు మెడికల్ : బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న విజయ సంకల్ప పాదయాత్ర గురువారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. స్థానిక సాయిబాబా గుడి రోడ్డు నుంచి ప్రారంభమై సుగాలి కాలనీ, వైశ్య బ్యాంక్ కాలనీ, విద్యానగర్ వరకు యాత్ర కొనసాగింది. యాత్రలో ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, డాక్టర్ శనక్కాయల అరుణ పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ తొమ్మిదిన్నర సంవత్సరాలలో ప్రధాని నరేంద్రమోదీ సాధించిన అభివృద్ధిని వివరించారు. మాగంటి సుధాకర్ యాదవ్, పాలపాటి రవికుమార్, చంద్రశేఖర్ గుప్తా, స్టాలిన్, కుమార్ గౌడ్, నాగమల్లేశ్వరి యాదవ్, శ్రీనివాసరావు, రేణుకాదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.









